నమస్తే తెలంగాణ

# పెద్దపల్లి

5 కరీంనగర్, మంగళవారం 22 అక్టోబర్ 2024 PEDDAPALLI


### నమ్మకం లేకనే అమ్ముకుంటున్నం



నాకు పది ఎకరాలున్నది. కేసీఆర్ సర్కారున్నప్పుడు ఎంటదెంట వడ్లను కొన్నది. అన్ని సీజన్లకు రైతు బంధు వేసిండు. కొత్త సర్కారు వచ్చినంక ఇయ్యలె. సెంటర్లనైతే చాలు జేసుకుంటూ పోతన్నరు. వడ్లను కొనలేదు. ఇప్పట్ల కొంటరన్న నమ్మకం లేదు. అందుకే మాపల్లెకొచ్చిన వ్యాపారులకు అమ్ముకోవాల్సి వచ్చింది. క్వింటాల్‌కు ₹1850కి వంద క్వింటాళ్లు అమ్మినా. ఇంకా అమ్మేటియి ఉన్నయి. అకాల వర్షాలు పడుతున్నయి. వడ్లు నానితే సెంటర్ల కొంటారా? కొన్నవాటికి పైసలు ఎప్పుడిత్తరో? అసలే వానలు పడి రంగు మారుతుంది.

**- పలుమారి రవి, రైతు రామోజీపేట (ఇల్లంతకుంట)**

# కేంద్రాలు సరే.. కొనుగోళ్లు ఏవి?

- ఉమ్మడి జిల్లాలో 1,330 కేంద్రాలు లక్ష్యం
- ఇప్పటి వరకు తెరిచినవి పదుల సంఖ్యలోనే
- నేటికి మొదలుకాని కొనుగోళ్లు!
- కల్లాల వద్దే వ్యాపారుల కాంటాలు
- మద్దతు ధరకు మంగళం
- క్వింటాల్‌కు ₹1,800 నుంచి ₹1,900కే చెల్లింపు
- నష్టపోతున్న రైతులు

'గ్రామానికో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తం. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు చేస్తం' అని ప్రభుత్వం గొప్పలు చెప్పినా.. ఆచరణలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉన్నది. ఉమ్మడి జిల్లాలో 1,330 కేంద్రాలు తెరవాలని లక్ష్యంగా పెట్టుకొని, ఎమ్మెల్యేలు, మంత్రులు అక్కడక్కడా ఈ కేంద్రాలను ప్రారంభించినా.. ఇంకా ఎక్కడా కొనుగోళ్లు మొదలు కానేలేదు. ఈ పరిస్థితుల్లో రైతులు ధాన్యం అమ్ముకునేందుకు దళారులు, వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఓ వైపు వర్షం పడుతుండడం, మరోవైపు కేంద్రాల్లో కొనకపోవడంతో అగ్గువసగ్గువకే అమ్ముకుంటున్నారు. అయితే అకాల వర్షాల కారణంగా తేమ శాతం అధికంగా ఉందని, కేంద్రాల్లో కొనుగోళ్లు జరపాలంటే మరో వారమైనా పడుతుందని అధికారులు చెబుతుండగా, ఆ మాత్రం దానికి ఇప్పుడే కొన్నట్టు కేంద్రాలను ప్రారంభించుడెందుకని ప్రశ్నిస్తున్నారు.



ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో దళారులకు ధాన్యం తూకం వేస్తున్న కూలీలు

పెద్దపల్లి, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ) : వానకాలం సీజన్ పూర్తయింది. కోతల ప్రక్రియ మొదలైంది. సాధారణంగా అక్టోబర్ రెండో వారంలో కొనుగోళ్లు ప్రారంభించాల్సి ఉన్నది. ఇప్పటి నుంచి వచ్చే జనవరి వరకు కొనుగోళ్లు జరిగినా.. ఈ నెలలో 20 నుంచి 25 శాతం కొనుగోళ్లు జరిగే అవకాశముంటుంది. ముందుగా వరి సాగు చేసిన రైతులు ఇప్పటికే కోతలు ప్రారంభించగా, అందుకనుగుణంగా అధికారులు కేంద్రాలు ప్రారంభించి కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలి. గడిచిన పదేళ్లుగా ఇదే ఆనవాయితీ కొనసాగుతున్నది. కానీ, ఈ సారి అంతా విరుద్ధంగా నడుస్తున్నది. కరీంనగర్‌లో 340, జగిత్యాలలో 421, పెద్దపల్లిలో 311, సిరిసిల్లలో 258 చొప్పున ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,330 కేంద్రాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకొని.. కొన్నింటిని ప్రారంభించినా దాదాపుగా ధాన్యం కొనుగోళ్లు ఎక్కడా జరగడం లేదు. కరీంనగర్ జిల్లాలో 44 కేంద్రాలు ఓపెన్ చేసినా.. ఒక్క కేంద్రంలోనూ కొనుగోలు చేయలేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు ఇలాంటే పరిస్థితి ఉండగా, కల్లాల వద్దనే దళారులు, వ్యాపారులు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ యేడాదికి కనీస మద్దతు ధర ఏ గ్రేడ్‌కు ₹2,320, సాధారణ రకానికి ₹2,300 నిర్ణయించింది కానీ, దళారులు మద్దతు ధరకు మంగళం పాడుతున్నారు. క్వింటాల్‌కు ₹1,800 నుంచి ₹1900 మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి కనిపిస్తున్నది.



తిమ్మాపూర్ శివారులో ప్రైవేట్ వ్యాపారులు ఏర్పాటు చేసిన కాంటా

### కొనుగోళ్లు ఎప్పుడో?

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కేంద్రాలు తెరుస్తున్న అధికారులు కొనుగోళ్ల ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. అకాల వర్షాల కారణంగా తేమ శాతం అధికంగా ఉంటున్నదని, నిబంధనల ప్రకారం 17 శాతం తేమ ఉంటేనే కొనుగోళ్లు చేస్తామని అధికారులు చెబుతున్నారు. కోతలు చేపట్టిన కొందరు రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. అకాల వర్షాల నుంచి దిగుబడిని రక్షించుకునేందుకు అక్కడే పడిగాపులు కాస్తున్నారు. ఓవైపు కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడం, మరోవైపు అకాల వర్షాలు పడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. కనీసం తెరిచిన కేంద్రాల్లోనైనా కొనుగోళ్లు జరిపితే తాము దళారులను ఆశ్రయించే పరిస్థితి ఉండదని చెబుతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే అధికారులు మాత్రం, ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభించేందుకు మరో వారం పదిరోజులైనా పట్టవచ్చని నమ్మబలుకుతున్నారు.

### నమ్మకం పోతోందా..?

రాష్ట్ర ప్రభుత్వం ఆది నుంచీ తమకు వ్యతిరేకంగా ఉందని రైతులు వాపోతున్నారు. కాంగ్రెస్ చెప్పినట్టు రైతులందరికీ రుణమాఫీ కాకపోవడం, వానకాలం సీజన్ దాటిపోయినా రైతు భరోసా ఇవ్వకపోవడం సర్కారు వైఫల్యమేనని విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం కొన్న తర్వాత డబ్బులు విడుదల చేయడంలో జాప్యం జరిగితే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా తమకు నమ్మకం కుదరడం లేదని చెబుతున్నారు. మరోవైపు అకాల వర్షాలతో ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లోనే దళారులు, వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా అనేక గ్రామాల్లో వ్యాపారులు కొనుగోళ్లకు ఎగబడుతున్నారు. తక్కువ ధరకే ధాన్యం దండుకుపోతున్నారు. ఇటు సన్నాల కొనుగోళ్లకు ప్రభుత్వం కొర్రీలు పెట్టడం, కేవలం 33 రకాలు మాత్రమే కొంటామని ప్రకటించడం, కేంద్రాల్లో మైక్రో మిషన్లు ఏర్పాటు చేస్తామని చెప్పడంతో రైతులు అయోమయంలో పడ్డారు. ఈ విషయంపై నమ్మకం లేక సన్న రకాలను అగ్గువకే అమ్ముకుంటున్నారు.

### కొనే దిక్కేలేదు



మాది పెద్దూరు. నాకు మూడెకరాల పొలం ఉన్నది. సెంటర్‌కు వడ్లు తెచ్చి పన్నెండు రోజులైతంది. వానకు నానుతున్నవి. ఎండకు ఎండుతున్నయి. తడిసినప్పుడల్లా తిర్ల మర్ల పోత్తున్నం. మాకు ఇంకో పనేలేదు. మబ్బుల పడుతున్నప్పుడల్లా జల్లుమంటంది. అక్కడక్కడ సెంటర్లు స్టార్ట్ చేసిన్రు. గింజలైతే కొంటలేరు. గీసర్కారొచ్చినంక పెట్టుబడికి పైసలే ఇయ్యలే. అక్కడక్కడ బాకీలు తెచ్చి లాగోడిపెట్టుకున్నం. ఇగ గింజలేమి కొంటుందో లేదో అర్థమయితలేదు. చాలా మంది రైతులు తుట్టికే దళారీలకు అమ్ముకుంటున్రు. మాపరిస్థితి ఏడికత్తదో

**- తిరుపతి, రైతు (పెద్దూరు)**

### నష్టాలకే అమ్ముకున్న



నాకున్న నాలుగెకరాల పొలంలో 110 క్వింటాళ్ల వడ్లు వచ్చినయి. క్వింటాల్‌కు ₹1900కు అమ్మిన. సర్కారు మద్దతు ధర ₹2320 ప్రకటించింది. ఇప్పటి వరకు గింజలు కొన్న దిక్కులేదు. ఎక్కడ పడితే అక్కడ సెంటర్లు చాలు జేసుకుంటూ పోతున్నరు. గింజలు తీస్కొని పోతే వానత్తే సౌలతు లేదు. కొనేదాక సెంటర్లలో నీలుగాలే. తాలంటరు. జాలి పట్టలేదంటరు. ఎండలేదంటరు. గిట్ల కొర్రీలు పెట్టి క్వింటాల్‌కు ఏడు కిలోలు తరుగు జోకుతరు. అందుకే నష్టమొచ్చినా ప్రైవేటోళ్లకు అమ్ముకుంటున్నం.

**- దర్శనం చంద్రయ్య, రైతు (పెద్దలింగాపూర్)**



మంజూరు పత్రాలు చూపుతున్న దళితబంధు లబ్ధిదారులు

# హుజూరాబాద్‌పై వివక్ష ఎందుకు?

- దళితబంధు నిధులు మదిరలో ఎలా పంపిణీ చేశారు?
- పైలెట్ సెగ్మెంట్‌లో ఫ్రీజింగ్ ఎత్తివేయాలి
- 26న జరిగే కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవాల్సిందే..
- లేకుంటే సీఎం ఇంటి ఎదుట చావుడప్పు మోగుడే!
- హుజూరాబాద్ దళితబంధు లబ్దిదారుల అల్టిమేటం

కరీంనగర్ కలెక్టరేట్, అక్టోబర్ 21 : ఆర్థికంగా బలహీనంగా ఉన్న దళితసామాజిక వర్గాన్ని ఆదుకునేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన దళితబంధు పథకం నిధుల పంపిణీలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హుజూరాబాద్ నియోజకవర్గంపై వివక్ష చూపుతున్నదని నియోజకవర్గ దళితబంధు లబ్దిదారులు ధ్వజమెత్తారు. తమ నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన దళితబంధు పథకానికి సంబంధించి రెండో విడుత నిధులు విడుదల చేసేందుకు ఈ నెల 26న జరిగే కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ మేరకు సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 80 మందికి పైగా లబ్ధిదారులు తరలివచ్చి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, తమ ఖాతాల్లో జమయిన మొత్తంపై ఫ్రీజింగ్ విధించిన ప్రభుత్వం ఖమ్మం జిల్లా మదిర అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని చింతకాని మండలంలో ఎలా పంపిణీ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గానికో నీతి.. పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన హుజూరాబాద్ సెగ్మెంట్‌కో నీతా? అంటూ ప్రశ్నించారు. గత నెల 16న అక్కడ ₹15.62 కోట్లకు పైగా దళితబంధు నిధులు విడుదల చేసి, 847 మందికి చెక్కులు పంపిణీ చేశారని, కానీ, ఇక్కడ మాత్రం ప్రభుత్వం అందుకు భిన్నంగా నడుచుకోవడం వెనుక ఆంతర్యమేంటో చెప్పాలని నిలదీశారు. గత ప్రభుత్వం జమ చేసిన మొత్తాన్ని ఈ ప్రభుత్వం అడ్డుకోవడం దళితుల అభివృద్ధికి మోకాలడ్డడమేనని విమర్శించారు. ఫ్రీజింగ్ ఎత్తివేయకుండా తాత్సారం చేస్తుండడం చూస్తే దళితుల ఎదుగుదలపై ఉక్కుపాదం మోపుతుందనడానికి నిదర్శనమని స్పష్టం చేశారు. మొదటి విడుత జమైన నగదుతో దుకాణాల అద్దెతోపాటు హోల్‌సేల్ వ్యాపారులకు అడ్వాన్సులుగా ఇచ్చామని, రెండో విడుత రాక తమ పరిస్థితులు రెంటికీ చెడ్డ రేవడిలా మారాయని పలువురు మహిళా లబ్ధిదారులు కన్నీటి పర్యంతమయ్యారు. గత పదినెలలుగా తాము కలువని అధికారి లేడని, ఎక్కని గడప లేదని, అయినా తమపై కనీస కనికరం లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఈనెల 26న నిర్వహించబోయే కేబినేట్ సమావేశంలో నిర్ణయం తీసుకోకుంటే హైదరాబాద్ వేదికగా ఆందోళనలు చేపడుతామని, సీఎం ఇంటి ఎదుటే చావుడప్పు కొడుతామంటూ అల్టిమేటం జారీ చేశారు. వినతిపత్రాలు అందజేసిన వారిలో కొలుగూరి నరేశ్, ఇనుగాల భిక్షపతి, కుమార్, అలువాల రాములు, సరిత, అరుణ, సౌజన్య, ఉదయ్‌కుమార్ ఉన్నారు.

### దళితులు ఎదగడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదా?



దళితబంధు పథకంతో ఎంపికైన మాకు రెండుపూటలా పట్టెడన్నం దొరుకుతుందనే సంతోషంలో ఉంటే, కాంగ్రెస్ ప్రభుత్వం దానిని ఆవిరి చేస్తున్నది. ఈ పథకం ద్వారా మా ఖాతాల్లో జమైన మొత్తాన్ని కూడా మేం విడిపించుకోకుండా అడ్డుతగులుతుండడం దుర్మార్గమైన చర్య. మా ఖాతాలపై ఫ్రీజింగ్ విధించడం చూస్తే దళితులు ఆర్థికంగా ఉన్నత స్థితికి ఎదగడం కాంగ్రెస్ పార్టీకి ఇష్టం లేదని స్పష్టమవుతున్నది. ప్రభుత్వ పాశవిక చర్యలను నిరసిస్తూ హుజూరాబాద్ నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేపడుతం. నిరసన తెలుపుతం.

**- సౌజన్య, దళితబంధు లబ్ధిదారు, కొత్తపల్లి (జమ్మికుంట మండలం)**

### తాడోపేడో తేల్చుకుంటం



దళితుల అండదండలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ దళితులనే దగా చేసే ప్రయత్నం చేస్తుండడం బాధాకరం. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మాకు దళితబంధు పథకం ద్వారా ప్రయోజనం చేకూరితే, కాంగ్రెస్ ప్రభుత్వం దానిని కాలరాస్తున్నది. అధికారంలోకి వచ్చిన తర్వాత చిల్లిగవ్వ లేకుండా విడుదల చేస్తామని చెప్పి, ఇప్పటికీ ఫ్రీజింగ్ ఎత్తేయకపోవడం దారుణం. కాంగ్రెస్ పార్టీకి దళితులే వెన్నెముక అని ఆ పార్టీ అగ్రనాయకత్వం భావిస్తుంటే, రాష్ట్రంలో మాత్రం దళితులపై కాంగ్రెస్ ప్రభుత్వం దండయాత్ర చేస్తున్నది. ఇప్పటికైనా రెండో విడుత నిధులు విడుదల చేయడంపై ఈనెల 26న జరుగబోయే కేబినేట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలి. లేనిపక్షంలో హైదరాబాద్‌లోని ప్రజాభవన్ ఎదుటే ఆందోళనలు చేపడుతం.

**- కొలుగూరి నరేశ్, దళితబంధు లబ్ధిదారుడు (జమ్మికుంట పట్టణం)**

- ఒక గురుకులంలా మార్చుకుందాం
- న్యాక్ గుర్తింపే మొదటి ప్రాధాన్యం
- యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి
- కొత్త కోర్సులు ప్రవేశ పెడుతాం
- గవర్నర్‌ను ఆహ్వానించి రెండో స్నాతకోత్సవం నిర్వహిస్తాం



తన చాంబర్‌లో ఫైలుపై సంతకం చేస్తున్న వీసీ ఉమేశ్ కుమార్

# ఎస్‌యూను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

### శాతవాహన యూనివర్సిటీ నూతన వీసీ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 21 : విద్యార్థుల ప్రయోజనాల కోసం శాతవాహన యూనివర్సిటీని రాష్ట్రంలోనే ఉత్తమ విశ్వ విద్యాలయంగా.. ఆదర్శంగా తీర్చిదిద్దుకుందామని, ఒక గురుకులంలా మార్చుకుందామని ఎస్‌యూ నూతన వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ పేర్కొన్నారు. ఇది అందరి సహకారంతోనే సాధ్యమవుతుందని, అందుకు కలిసి కట్టుగా ముందుకు సాగుదామన్నారు. సోమవారం ఉదయం యూనివర్సిటీలోని ఆయన చాంబర్‌లో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య, కుటుంబసభ్యుల సమక్షంలో విధుల్లో చేరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను సీనియర్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ విరమణ పొందినా, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌కు ఈసీ మెంబర్‌గా, బన్సీలాల్ స్టేట్ యూనివర్సిటీ, హర్యానా, గవర్నర్ నామినీ వ్యవహరిస్తున్నానని చెప్పారు. యూనివర్సిటీకి న్యాక్ గుర్తింపు తీసుకు రావడమే తన మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. దీంతోపాటు ఇంజినీరింగ్ కళాశాలకు ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డితో పాటు జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. అందుకు కావాల్సిన స్థలం మనకు అందుబాటులో ఉన్నదని తెలిపారు. కొత్త కోర్సులు, విద్యార్థులకు ఉపయోగపడే జాబ్ ఓరియంటెడ్, మల్టీ డిసిప్లేనర్ కోర్సుల ప్రవేశానికి ప్రత్యేకంగా దృష్టి పెడతామన్నారు. అందులో ఏ కోర్సు నుంచి ఏ కోర్సుకైనా వెళ్లేలా అవకాశం ఉంటుందన్నారు. అలాగే, బీఈడీ, ఎంఈడీ కళాశాలల ఏర్పాటు విషయం కూడా పరిశీలిస్తామన్నారు. తాను రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో యూనివర్సిటీలో స్నాతకోత్సవం నిర్వహించామని, గవర్నర్, చాన్సలర్ జిష్ణుదేవ్ వర్మను ఆహ్వానించి రెండో స్నాతకోత్సవం నిర్వహించుకుందామన్నారు. ఇప్పటికే యూనివర్సిటీ సమస్యలను పలువురు తన దృష్టికి తీసుకువచ్చారని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఇక్కడ రిజిస్ట్రార్ ఎం వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై కిశోర్, ప్రసాద్, పరీక్షల నియంత్రణాధికారి ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్, యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎండీ జాఫర్ జారీ, యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డీ హరికాంత్, యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జయంతి తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత పలు కళాశాలల చైర్మన్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులు వీసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# వీడియోకాల్.. ఎత్తితే చిత్తే



- సైబర్ నేరగాళ్ల 'న్యూ'డ్ ఎత్తులు
- ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు మహిళల నగ్న వీడియో కాల్స్
- లిఫ్ట్ చేస్తే చాలు.. వీక్షించినట్టు రికార్డు
- తర్వాత డబ్బులు డిమాండ్ చేస్తూ బ్లాక్‌మెయిల్
- ఇటీవల ఉమ్మడి జిల్లాలో పలువురికి ఫోన్లు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

ఈజీ మనీ లక్ష్యంగా ఇటీవలి కాలంలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. పెరుగుతున్న సాంకేతికత పుణ్యమా అని రోజుకో తీరున మోసం చేస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. ఇన్నాళ్లూ బ్యాంక్, ఏటీఎం, క్రెడిట్ కార్డులు, వాట్సాప్ లింకులతో దోచుకున్న కేటుగాళ్లు, కొత్తగా న్యూడ్ కాల్స్ ఎత్తులు వేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు అపరిచిత నంబర్ల నుంచి మహిళలతో న్యూడ్ కాల్స్ చేయిస్తూ, లిఫ్ట్ చేయగానే వీక్షించినట్టు రికార్డు చేసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. ఇలాగే ఉమ్మడి జిల్లాలో పలువురు ప్రజాప్రతినిధులకు కాల్స్ రావడం చర్చనీయాంశమైంది. ఇది సైబర్ నేరగాళ్ల పనేనని, ఇలాంటి ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని పోలీస్‌శాఖ హెచ్చరిస్తున్నది.

కమాన్‌పూర్, అక్టోబర్ 21: సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తులు వేస్తున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రముఖులను కలవరపెట్టిస్తున్నారు. ఇలాగే ఇటీవల పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలంలోని ఓ మాజీ ప్రజాప్రతినిధిని వణికించారు. ఈ నెల 11న మధ్యాహ్నం సదరు మాజీ ప్రజాప్రతినిధికి అపరిచిత నంబర్ నుంచి వీడియో కాల్ వచ్చింది. లిఫ్ట్ చేయగానే మహిళ నగ్నంగా హాయ్ అంటూ మాట్లాడగా, అవాక్కయ్యాడు. ఎవరో ఎందుకు ఫోన్ చేశారో.. తెలియక వెంటనే కాల్ కట్ చేశాడు. ఆ తర్వాత కాసేపటికే మరో వీడియో కాల్ రాగా, లిఫ్ట్ చేశాడు. అది కూడా న్యూడ్ కాల్ కావడంతో మళ్లీ కట్ చేశాడు. ఇదేంటి..? ఈ కాల్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయా..? అని చాలా కంగారుపడిపోయాడు. ఇంతలోనే ఓ పోలీస్ అధికారి ఫొటో డీపీగా పెట్టుకున్న నంబర్ నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. అప్పటికే కంగారులో ఉన్న సదరు ప్రజాప్రతినిధి లిఫ్ట్ చేశాడు. 'నేను పోలీసు కమిషనర్‌ను మాట్లాడుతున్నా. నీవు ఇప్పుడు చూసిన న్యూడ్ వీడియోలు యూట్యూబ్‌లో వైరల్ అవుతున్నాయి. వెంటనే యూట్యూబర్‌తో మాట్లాడు' అంటూ సదరు యూట్యూబర్ నంబర్ ఇచ్చి ఫోన్ కట్ చేశాడు. సదరు నంబర్‌కు మాజీ ప్రజాప్రతినిధి ఫోన్ చేయగా వైరల్ అవుతున్న న్యూడ్ కాల్ వీడియో తొలిగించాలంటే ₹17,500 చెల్లించాల్సి ఉంటుందని డిమాండ్ చేశాడు. తన వద్ద అంత డబ్బులు లేవని చెప్పగా, అయితే వైరల్ అవుతున్న వీడియోను తొలగించడం కుదరదని అవతలి వ్యక్తి తెగేసి చెప్పాడు. అంతలోనే ఆ మాజీ ప్రజాప్రతినిధి కొడుకు వచ్చి విషయం తెలుసుకొని, ఇది సైబర్ నేరగాళ్ల పనేనని గుర్తించాడు. సదరు పోలీస్ అధికారికి ఫోన్ చేసి.. 'మేమే పోలీసుల వద్దకు వచ్చాం. ఒకసారి సార్‌తో మాట్లాడండి అని గద్దించినట్లు' మాట్లాడడంతో కాల్ కట్ చేశాడు. మళ్లీ పలుసార్లు ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదు. తర్వాత ఆ మాజీ ప్రజాప్రతినిధి ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. ఇలా ఇటీవల ఓ ఎమ్మెల్యేకు సైతం కాల్ రాగా, వెంటనే అప్రమత్తమై కాల్ కట్ చేసి పోలీసులను ఆశ్రయించినట్టు తెలిసింది. వీరే కాదు, ఉమ్మడి జిల్లాలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు సైతం న్యూడ్ వీడియో కాల్స్ వచ్చినట్టు తెలియగా, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరమున్నది.



### మహిళ మనిషేనా.. ఏఐ బొమ్మనా..?

న్యూడ్ వీడియోలో కనిపించే మహిళ నిజమైన మనిషి అని చాలా మంది అనుకుంటారు. కానీ, కొనిసార్లు అందులో కనిపించే మహిళలు, యువతులు నిజమై ఉండకపోవచ్చు. అదంతా సైబర్ నేరగాళ్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా సృష్టించిన బొమ్మ (సాఫ్ట్‌వేర్). ఇది నేరగాళ్లు చెప్పినట్లే నడుచుకుంటుంది. అందులో చాటింగ్, వీడియో కాల్స్‌కు ఎలా స్పందించాలో ముందే అల్గారిథమ్‌లో పొందుపరుస్తారు. దీంతో ఎదుటి వారికి ఎలాంటి అనుమానం రాదు. ఇది తెలియక అవతలి వైపు ఉన్న వారు నిజంగా మనిషే ఉందని భ్రమ పడి, మోసాలకు గురవుతున్నట్టు తెలుస్తున్నది.

### అప్రమత్తతే రక్ష

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాల పై పల్లెల్లో.. పట్టణాల్లో ఎన్నో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నప్పటికీ మోసపోయే బాధితుల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. ఎవరికైనా అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్, వాట్సాప్ ఫోన్ కాల్, వాట్సాప్ వీడియో కాల్ వస్తే వాటిని లిఫ్ట్ చేయకుండా ఉండాలి. ఒకవేళ లిఫ్ట్ చేయాల్సి వస్తే ఫ్రంట్ కెమెరాపై చూపుడు వేలు పెట్టి లిఫ్ట్ చేయాలి. అవతలి వ్యక్తి మనకు పరిచయస్తులు అయితే కాల్ కంటిన్యూ చేసి మాట్లాడాలి. లేదంటే కట్ చేయాలి. అయితే ఫోన్ వచ్చిన సమయాల్లో చాలా మంది తొందర పడి లిఫ్ట్ చేస్తున్నారు. మోసాల బారిన పడుతున్నారు. కాగా, గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్ లిఫ్ట్ చేయకుండా ఉండడమే ఉత్తమమని, ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే 1930కు డయల్ చేసి విషయం చెప్పాలని పోలీసులు సూచిస్తున్నారు. అలాంటప్పుడే సైబర్ క్రైం పోలీసులు చర్యలు తీసుకుంటారని కమాన్‌పూర్ ఎస్ఐ కొట్టె ప్రసాద్ చెబుతున్నారు.

# వర్షం.. వరికి నష్టం



పెద్దపల్లి మండలం మారేడుగొండలో తాటిచెట్టుపై పిడుగు వేయడంతో అంటుకున్న మంటలు



సారంగాపూర్: తాళ్లధర్మారంలో వర్షానికి నేలవాలిన వరి

పెద్దపల్లి/ పెద్దపల్లి రూరల్/సారంగాపూర్ అక్టోబర్ 21 : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సోమవారం సాయంత్రం పలుచోట్ల వర్షం పడింది. దీంతో వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఈదురుగాలులతో వర్షం పడడంతో కోతకచ్చిన వరిపంటలు నేలకొరిగాయి. తాళ్లధర్మారం గ్రామంలో సుమారు వంద ఎకరాల్లో వరి పంటలు నేలవాలాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో దాదాపు గంట పాటు వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాజీవ్ రహదారికి ఇరువైపులా మురికి కాలువ సక్రమంగా లేకపోవడంతో రంగపల్లి న్యూ కోర్టు బస్టాప్ సమీపంలో రాజీవ్ రహదారి పక్కన ఇంట్లోకి వరద చేరింది. పెద్దపల్లి మండలం మారేడుగొండ లో ప్రధాన రహదారి పక్కన ఉన్న తాటిచెట్టుపై పిడుగు పడడంతో మంటలు అంటుకున్నాయి.

# దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కమన్‌చౌరస్తా, అక్టోబర్ 21 : కరీంనగర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ కే అశోక్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, ఆసక్తి గల విద్యార్థులు www.iti.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లో వెరిఫికేషన్ ఫీజు చెల్లించి ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆన్‌లైన్ ప్రింటెడ్ కాపీ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు వాక్ ఇన్ అడ్మిషన్స్‌కి హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 77991 00360, 99891 82747 నంబర్లను సంప్రదించాలని సూచించారు.